సాక్షి ప్రకాశం

సోమవారం । 15 । మే । 2023



భక్తిశ్రద్ధలతో హనుమాన్ శోభాయాత్ర

హనుమాన్ జయంతిని పురస్కరించుకుని కనిగిరిలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. - 10లో..



వైభవంగా ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల

చీమకుర్తి మండలం కూనంనేనివారిపాలెంలో ప్రసన్నాంజనేయస్వామి తిరునాళ్ల వైభవంగా నిర్వహించారు. - 10లో..

వాతావరణం

గరిష్టం/కనిష్టం 43 /31

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. వాతావరణం పొడిగా ఉంటుంది. వడగాలులు వీస్తాయి.



జై భజరంగీ..

హనుమజ్జయంతి వేడుకలను ఆదివారం జిల్లావ్యాప్తంగా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలుచోట్ల హనుమాన్ శోభాయాత్రలు కన్నుల పండువగా సాగాయి.

ధన్‌యా

మన ధన్‌యా.. దునియా అంతా మార్కెటింగ్ అవుతోంది. మసాలా దినుసుల్లో సుమధుర సువాసనలు వెదజల్లుతూ మహా రుచినిచ్చే ధనియాలకు జిల్లాలోని ఉప్పుగుండూరు ప్రసిద్ధి. ఈ దినుసు లేకపోతే అది శాఖాహారమైనా, మాంసాహారమైనా రుచి ఉండదు. నాన్ వెజ్ ప్రియులు ధనియాల మసాలా దినుసు తగలగానే లొట్టలేసుకుంటారు. అంతటి మధురిమ ధనియాల సొంతం. అలాంటి ధనియాలతో మన జిల్లాకు అవినాభావ సంబంధం ఉంది. నాగులుప్పలపాడు మండలంలోని ఉప్పుగుండూరులో ధనియాల క్లీనింగ్‌కు విశిష్టత ఉంది. రాష్ట్ర వ్యాప్తంగా ఈ క్లీనింగ్ యూనిట్లు రెండు చోట్లనే ఉన్నాయి. అందులో ఒకటి వైఎస్సార్ జిల్లాలోని జమ్మలమడుగు కాగా రెండోది ఉప్పుగుండూరు.



ధనియాలను రాశిగా పోస్తున్న కూలీలు

- నార్త్ టు సౌత్ వయా ఉప్పుగుండూరు
- ధనియాల క్లీనింగ్‌కు ప్రసిద్ధి
- 500 కుటుంబాలకు జీవనాధారం
- ఉత్తరాది రాష్ట్రాల నుంచి దిగుమతి
- దక్షిణాది రాష్ట్రాలకు ఎగుమతి

సాక్షి డెస్క్, ఒంగోలు: జిల్లాతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా నల్లరేగడి భూముల్లో ధనియాల పంట పండించేవారు. ఈ క్రమంలో ఉప్పుగుండూరులో ఇబ్బడి ముబ్బడిగా ధనియాల క్లీనింగ్ యూనిట్లు నెలకొన్నాయి. కొన్ని దశాబ్దాలుగా ఇక్కడి నుంచి దక్షిణాది రాష్ట్రాలతో పాటు ఉత్తరాది రాష్ట్రాలకు కూడా రవాణా చేస్తున్నారు. కాలక్రమంలో రాష్ట్రంలో ధనియాల పంట తగ్గిపోయింది. ఇదే సమయంలో ఉత్తరాది రాష్ట్రాల్లో విస్తారంగా ఈ పంటను పండిస్తున్నారు.

ఉత్తరాది రాష్ట్రాల నుంచి దిగుమతి

వాణిజ్య పంటలైన మిరప, పొగాకు రావడంతో ఈ ధనియాల పంటను ఇక్కడ సాగు చేసేవారు తగ్గిపోయారు. ఉత్తరాదిలోని మహారాష్ట్ర, గుజరాత్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాల్లో ఈ పంటను అధికంగా పండిస్తున్నారు. ఈ క్రమంలో గతంలో ఇక్కడి నుంచి వ్యాపారులు అక్కడ పంటను కొనుగోలు చేసి ఆయా ప్రాంతాల్లో ఉన్న క్లీనింగ్ యూనిట్ల ద్వారా తినడానికి అనువైన విధంగా తయారు చేసుకుని ఈ పంట ఎక్కు వగా వినియోగించే దక్షిణాది రాష్ట్రాలు తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు రవాణా చేసేవారు. అయితే ఉత్తరాదిలో కొనుగోలు చేసి దక్షిణాదిలో అమ్మే పంట కావడంతో వ్యాపారస్తులు తమ స్వగ్రామం ఉప్పుగుండూరులోనే సొంతంగా క్లీనింగ్ యూనిట్లు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడే క్లీనింగ్ చేయించుకుని దక్షిణాది రాష్ట్రాలకు ఎగుమతి చేస్తున్నారు.

20 క్లీనింగ్ యూనిట్ల ఏర్పాటు

ఉప్పుగుండూరులోనే సుమారు 20 వరకు మిల్లులు ఏర్పాటు చేసుకున్నారు. క్లీనింగ్ ప్రాసెస్ అంతా పూర్తి చేసి ఇక్కడి నుంచే ఎగుమతులు ప్రారంభించారు. అయితే కరోనా ప్రభావం తర్వాత చెన్నై వంటి ప్రాంతాల్లో కూడా క్లీనింగ్ యూనిట్లు ఏర్పాటు చేయడంతో ఇక్కడ కొంత వ్యాపారం సన్నగిల్లింది. ఉత్తరాది రాష్ట్రాల నుంచి నేరుగా చెన్నై, కేరళకు సరుకు తరలిపోతోంది. దీంతో ఉప్పుగుండూరులో ప్రస్తుతం 10 క్లీనింగ్ యూనిట్లు మాత్రమే నడుస్తున్నాయి. ఇక్కడి నుంచి నెలకు సుమారుగా 40 టన్నులు, ఏడాదిలో 500 టన్నుల మేర సరుకును దిగుమతి చేసుకొని ప్రాసెసింగ్ అనంతరం హోల్‌సేల్, రిటైలర్లకు అమ్మకం సాగిస్తుంటారు.

ధనియాల శుద్ధి ఇలా

ధనియాలు నేరుగా చేలల్లో నుంచి రావడం వలన అక్కడి నుంచి వచ్చేటప్పుడు ఉండే పుల్ల, బద్దను ప్రాథమికంగా కార్మికులు వేరు చేస్తారు. ఈ క్రమంలో పంట నాణ్యతలో ఏదైనా ఇబ్బంది కలిగితే ఫుడ్ కలర్‌తో కలిపి ధనియాలను వేడిలో మగ్గబెట్టి సరుకు నాణ్యతను పెంచుతారు.

ఉత్తరాది పంటకు డిమాండ్

ఈ ధనియాల పంట మన రాష్ట్రంలో కూడా పండిస్తున్నా ఉత్తరాది రాష్ట్రాలైన గుజరాత్, రాజస్థాన్ సరుకుకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. మన దగ్గర పండే పంటలో తరుగు, రంగు లోపం ఉండడంతో పాటు ఉత్తరాదిలో పండే పంటలో లావు గింజ రావడం చూడడానికి రంగు బాగుండడంతో వినియోగదారులు గుజరాత్‌లో పండే పంట వైపే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు.

500 కుటుంబాలకు ఉపాధి

ఈ ధనియాల క్లీనింగ్ పై ఆధారపడి ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు 500 కుటుంబాలకు పైనే జీవనం సాగిస్తున్నారు. లారీడ్రైవర్లు, క్లీనర్లు, హమాలీలు, గ్రేడింగ్ చేసే మహిళా కూలీలతో కలిపి ఇన్ని కుటుంబాలు యూనిట్లపై ఆధార పడుతున్నాయి. వీరికి సంవత్సరమంతా ఉపాధి దొరుకుతుంది.



1. రాశిగా పోసిన ధనియాలు
2. బద్ద, పుల్ల వేరుచేస్తున్న మహిళా కూలీలు
3. ధనియాలు జల్లెడ పడుతున్న కూలీలు
4. ధనియాలు క్లీనింగ్ చేసే యూనిట్
5. గోడౌన్‌లో ఉన్న ధనియాలు

వ్యాపారాలు సన్నగిల్లాయి

కరోనా ప్రభావం తర్వాత ధనియాల వ్యాపారం బాగా దెబ్బతింది. గతేడాది 40 కిలోల బస్తా రూ.5,800 వరకు ధర పలికి రూ.5,200 వద్ద స్థిరంగా వ్యాపారం సాగింది. ప్రస్తుత ఏడాది ఈ ధర రూ.3,200 లోపు మాత్రమే ఉంది. సరుకు కూడా నాణ్యత తగ్గిపోవడంతో వ్యాపారులు ఆటుపోట్లు ఎదుర్కొంటున్నాం.

– బిల్లం మురళి, వ్యాపారస్తుడు

నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం

ధనియాలనేది ప్రజలకు నిత్యావసర సరుకు కాబట్టి ఆయా క్లీనింగ్ యూనిట్లపై అధికారుల నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. వ్యాపారస్తులు కూడా ప్రభుత్వ నిబంధనలకు లోబడి భద్రతా ప్రమాణాలు పాటించి క్లీనింగ్ యూనిట్లు నడపాలి.

– గరికపాటి ప్రభాకర్‌రావు, జిల్లా ఆహార భద్రతాధికారి

సొంతూర్లోనే ఏడాదంతా పని



మా సొంత గ్రామంలోనే ఏడాదంతా పని దొరికే ధనియాల క్లీనింగ్ యూనిట్‌లో నేను, నాభర్త 15 ఏళ్లగా పని చేస్తూ పిల్లలను పోషించుకున్నాం. ఈ ధనియాల క్లీనింగ్ యూనిట్‌లో ఇద్దరం కలిసి రోజుకి రూ.1500 వరకు సంపాదిస్తున్నాం. ఈ ధనియాల క్లీనింగ్ ఎప్పటి నుంచో మా ప్రాంతంలో ఉండటం వలన చాలా మంది ప్రజలకు ఉపాధి కల్పిస్తోంది.

– నూకతోటి మరియమ్మ, ఉప్పుగుండూరు

ఉపాధి బాగానే ఉంది



ఎక్కడో పండే ధనియాల పంట వలన ఇక్కడ కార్మికులకు చాలా వరకు ఏడాదంతా పని దొరుకుతుంది. నేను 20 ఏళ్లుగా ధనియాల క్లీనింగ్ పని చేస్తున్నాను. గతంలో అయితే పని చాలా ఎక్కువగా ఉండటంతో పాటు ఆదాయం కూడా ఉండేది. ప్రస్తుతం మద్రాసులో కూడా ఇలాంటి క్లీనింగ్ యూనిట్లు పెరిగాయి. ఈ క్రమంలో గతం కంటే ఇప్పుడు ఆదాయం తక్కువగా ఉంటుంది. అయితే కాలంతో పని లేకుండా ఏడాదంతా పని దొరుకుతుంది.

– నల్లూరి సురేష్, ధనియాల క్లీనింగ్ కార్మికుడు

న్యూస్‌రీల్

బాలినేని, శిద్దాకు స్వాత్మానందేంద్ర స్వామి ఆశీస్సులు



మాజీమంత్రి బాలినేని, శిద్దా రాఘవరావును ఆశీర్వదిస్తున్న స్వాత్మానందేంద్ర స్వామి

ఒంగోలు: విశాఖ శారదా పీఠం ఉత్తరాధికారి స్వాత్మానందేంద్ర స్వామి మాజీమంత్రి, స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి, మాజీమంత్రి శిద్దా రాఘవరావులను ఆశీర్వదించారు. ఆదివారం స్వాత్మానందేంద్రస్వామి ఒంగోలులోని శిద్దా నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా బాలినేని కూడా శిద్దా నివాసానికి చేరుకుని ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా స్వామీజీ బాలినేని శ్రీనివాసరెడ్డి, శిద్దా రాఘవరావు దంపతులకు ఉమా మహేశ్వరస్వామి వారి శేషవస్త్రాలు, తీర్థ ప్రసాదాలు, కుంకుమ అందించారు.

నేడు నగరంలో బాలినేని పర్యటన

ఒంగోలు: స్థానిక ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి సోమవారం నగరంలో జరిగే పలు కార్యక్రమాల్లో పాల్గొంటారని ఆయన కార్యాలయ సిబ్బంది ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు స్థానిక అంజయ్య రోడ్డులోని బీసీ కులాల ఆరామ క్షేత్రాలకు, బీసీ పూలే భవన్‌లకు శంకుస్థాపన చేస్తారు. 11 గంటలకు పీర్లమాన్యంలో అర్బన్ హెల్త్ సెంటర్‌కు ప్రారంభోత్సవం, 11.30 గంటలకు మంగమూరు డొంక అయ్యప్పస్వామి సేమితి ఆధ్వర్యంలో మజ్జిగ, మినరల్ వాటర్‌తో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రం ప్రారంభిస్తారు. సాయంత్రం 5.30 గంటలకు స్థానిక గోపాలనగరంలో రెండో లైను ఎక్స్‌టెన్షన్‌లో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారు.

ఉత్సాహంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



ఎడ్లపోటీలను ప్రారంభిస్తున్న కృష్ణచైతన్య

కంభం: మండలంలోని రావిపాడు గ్రామంలో రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి తిరునాళ్ల సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన రాష్ట్ర స్థాయి ఎడ్ల పోటీల్లో పల్నాడు జిల్లా ఎడ్లు సత్తా చాటి ప్రథమ స్థానంలో నిలిచాయి. ఈ ఎడ్ల పోటీలను స్థానిక ఎమ్మెల్యే అన్నారాంబాబు కుమారుడు కృష్ణ చైతన్య చేతుల మీదుగా ప్రారంభించారు. పల్నాడు జిల్లా పిడుగురాళ్ల మండలం దప్పిలి అంజిరెడ్డి ఎడ్లు 1498 అడుగులు లాగి మొదటి బహుమతి కింద రూ.60 వేలను, నంద్యాల జిల్లా బేతంచెర్ల మండలం మేకల వెంకటరాముడు ఎడ్లు 1257 దూరం లాగి రెండవ బహుమతి రూ.50 వేలు, అర్థవీడు మండల వల్లెల క్రిష్టారెడ్డి ఎడ్లు 778 అడుగులు లాగి మూడో బహుమతి రూ.40 వేలు, బేస్తవారిపేట మండలం నాగశివశంకర్ ఎడ్లు 757 అడుగులు లాగి నాల్గవ బహుమతి రూ.30 వేలు, బేస్తవారిపేట మండలం సాయిసాత్విక్ ఎడ్లు 224 అడుగులు దూరం లాగి ఐదో బహుమతి రూ.20 వేలు దక్కించుకున్నాయి. ఈ ఎడ్ల పోటీలను తిలకించేందుకు చుట్టుపక్కల ప్రజలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

దేవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరికీ ఉండాలి



బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులను సన్మానిస్తున్న ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు

- ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

గురజాల: దేవుని ఆశీస్సులు ప్రతి ఒక్కరిపై ఉండాలని ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో నూతనంగా నిర్మించిన పల్నాటి యాదాద్రిగా పేరొందిన భూ సమేత నరసింహస్వామి దేవాలయాన్ని ఆదివారం ఆయన సతీమణితో కలిసి దర్శించుకున్నారు. దేవాలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ముందుగా బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులను అర్చకులు కారెంపూడి రాఘవచార్యులు, కారెంపూడి వేణుగోపాలాచార్యులు వేదమంత్రాలతో పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. స్వామి వారిని దర్శించుకున్న అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బాలినేని శ్రీనివాసరెడ్డి దంపతులను సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి యెనుముల మురళీధర్‌రెడ్డి, మండల కన్వీనర్ సిద్దాడపు గాంధీ, సీనియర్ నాయకుడు కొమ్మినేని వెంకటేశ్వర్లు (కేవీ), నగర పంచాయతి చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, వైస్ చైర్మన్ షేక్ బడేజానీ, మాజీ జడ్పీటీసీ బాసిరెడ్డి ఇష్టకామిరెడ్డి, మాజీ ఎంపీపీ వీరంరెడ్డి అమారారెడ్డి, షేక్ నాగులుమీరా, తదితరులున్నారు.

ఆంజనేయస్వామి గుడిలో మంత్రి సురేష్ పూజలు



వైపాలెంలో ఆంజనేయస్వామి గుడిలో పూజలు చేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: హనుమాన్ జయంతి సందర్భంగా ఆదివారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ఉన్న ఆంజనేయ స్వామి గుడిలో రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి మల్లికార్జునశర్మ ఆయన్ను ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ ఉడుముల శ్రీనివాసరెడ్డి, మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, సెంట్రల్ బ్యాంకు డైరెక్టర్ ఎం.బాలగురవయ్య, యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల పార్టీ అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, బి.వి.సుబ్బారెడ్డి, ఆర్య వైశ్య సంఘం నాయకులు ఇమ్మడిశెట్టి సత్యనారాయణ, కందూరి కాశీవిశ్వనాథ్, పబ్బిశెట్టి శ్రీనివాసులు, కందూరి ప్రసాద్, వైఎస్సార్ సీపీ నాయకులు ఎన్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

- రాష్ట్ర పురపాలక పట్టణాభివృద్ధిశాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్
- త్రిపురాంతకం మండలం గొల్లవాండ్ల పల్లిలో గడపగడపకు మన ప్రభుత్వం



వృద్ధురాలికి ప్రభుత్వ పథకాల లబ్ధి ప్రచారపత్రాన్ని అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

త్రిపురాంతకం: ప్రజల అభ్యున్నతికి, రాష్ట్ర పురోభివృద్ధికి వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పేర్కొన్నారు. త్రిపురాంతకం మండలం కేశినేనిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని గొల్లవాండ్లపల్లిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజల కోసమే పనిచేస్తుందని పేద, బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అన్నారు. ప్రతి ఒక్కరి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని చెప్పారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా అందిస్తున్న ఆర్థిక సహాయానికి ప్రతిపక్షాలు గండికొట్టే ప్రయత్నం చేస్తున్నాయని అన్నారు. నవరత్నాల ద్వారా ప్రజలకు అభివృద్ధి సంక్షేమ ఫలాలు అందిస్తున్న విషయాన్ని గుర్తు చేశారు. ప్రజా మన్ననలు పొందుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. ప్రజల సమస్యలకు తక్షణమే స్పందించిన మంత్రి సురేష్ వెంటనే అధికారులను పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు అందుబాటులో ఉండి సక్రమంగా విధులు నిర్వహించాలని సచివాలయ సిబ్బంది, వలంటీర్లను సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ వీ కిరణ్, ఎంపీడీవో మరియదాస్, ఎంఈఓ మల్లికార్జుననాయక్, డీఈ రామకృష్ణ, ఎంపీపీ కోట్ల సుబ్బారెడ్డి, వైఎస్సార్ సీపీ బీసీ సెల్ జిల్లా కార్యదర్శి ఆర్‌వీ పిచ్చయ్య, వైఎస్సార్ సీపీ కన్వీనర్ ఎస్ పోలిరెడ్డి, కో కన్వీనర్ యల్లారెడ్డి, ట్రస్ట్‌బోర్డు మాజీ చైర్మన్ మల్లికార్జున్, పార్టీ నాయకులు కోటయ్య, సత్యనారాయణరెడ్డి, వెంగళరెడ్డి, వెంకటరెడ్డి, నక్కా చిన్న త్రిపురారెడ్డి, బాలకోటిరెడ్డి, సుబ్రహ్మణ్యం తదితరులు ఉన్నారు.

సత్తాచాటిన జిల్లా ఎడ్ల జతలు



చోళ్లవీడులో బండలాగుతున్న ఎడ్ల జతలు

రాచర్ల: మండలంలోని చోళ్లవీడు గ్రామంలో వేమయ్య స్వామి ఆరాధన మహోత్సవం సందర్భంగా ఆదివారం ఉదయం 9 గంటల సమయంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి ఆరు పండ్ల సైజు ఎడ్ల బండలాగుడు పోటీల్లో కంభం మండలం యర్రబాలెం గ్రామానికి చెందిన వెంకటగిరి హేమలత నాయుడు ఎడ్ల జతలు సత్తాచాటాయి. ఈ ఎడ్ల పోటీల్లో మొత్తం 12 జతల ఎడ్లు పాల్గొనగా యర్రబాలెం గ్రామానికి చెందిన వెంకటగిరి హేమలత నాయుడు ఎడ్ల జతలు నిర్ణీత 15 నిమిషాల్లో 5750 అడుగులు లాగి మొదటి బహుమతి సాధించాయి. అదేవిధంగా గుంటూరు జిల్లా కాకాని మండలం తిక్కలపాడు గ్రామానికి చెందిన మందపాటి లింగయ్య చౌదరి ఎడ్లు 5036 అడుగులు లాగి రెండో బహుమతి సాధించగా, ప్రకాశం జిల్లా మార్కాపురం మండలం కే.కొత్తపల్లి గ్రామానికి చెందిన మట్టం జక్కరయ్య ఎడ్ల జతలు 4900 అడుగులు లాగి మూడో బహుమతిని సాధించగా నంద్యాల జిల్లా నంద్యాల మండలం ఎస్.కోత్తపల్లి గ్రామానికి చెందిన ఎమ్.వెంకటేశ్వర్లు ఎడ్ల జతలు 4780 అడుగులు లాగి నాల్గవ బహుమతి సాధించాయి. పల్నాడు జిల్లా బొల్లాపల్లి మండలం రాజుపాలెం గ్రామానికి చెందిన బి.సతీష్ నాయుడు ఎడ్లు 4762 అడుగులు లాగి ఐదో బహుమతి సాధించగా, నంద్యాల జిల్లా బండి ఆత్మకూరు మండలం ద్వారకనగరం గ్రామానికి చెందిన వి.రామమూర్తిరెడ్డి ఎడ్ల జతలు 4240 అడుగులు లాగి ఆరో బహుమతి, గిద్దలూరు మండలం నరవబయనపల్లె గ్రామానికి చెందిన జిల్లెల పిచ్చిరెడ్డి ఎడ్ల జతలు 4102 ఏడో బహుమతి సాధించాయి. ఎడ్లపోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.40 వేలను కర్ణా లక్ష్మయ్య, రెండో బహుమతి రూ.30 వేలను చోళ్లవీడు సర్పంచ్ గోతం వెంకట నారాయణ, మూడో బహుమతి రూ.20 వేలను యర్రగొల్ల పోలయ్య కుమారులు, నాల్గవ బహుమతి రూ.10 వేలను మాజీ సర్పంచ్ ముత్యాల మధుసూదన్‌రావు, ఐదో బహుమతి రూ.8 వేలను గోతం రంగనాయకులు, ఆరో బహుమతి రూ.5 వేలను ఆకుల నర్సింహులు, ఏడో బహుమతి రూ.4 వేలను మైలా గురవయ్య చేతుల మీదుగా ఎండ్ల యజమానులకు పంపిణీ చేశారు.

రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి

చీరాల రూరల్: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతిచెందిన సంఘటన ఆదివారం చినగంజాం రైల్వేస్టేషన్ సమీపంలో చోటుచేసుకుంది. మృతుడి వయస్సు 42 నుంచి 45 ఉంటుందని, నీలి రంగు జీన్స్ ప్యాంట్, లేత నీలి రంగు షర్ట్ ధరించి ఉన్నట్లు జీఆర్పీ ఎస్సై సీహెచ్ కొండయ్య తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పవనసుతా పాహిమాం


పామూరులో అలంకరణలో అభయాంజనేయస్వామి మూలవిరాట్


కొనకనమిట్ల మండలం రేగడపల్లిలో విశేష అలంకరణలో స్వామివారు

అంజనిపుత్ర జయహనుమంతా..
నీసరి ఎవరూ ఇలలేరయ్యా..
భయములు బాపే శ్రీహనుమంతా..
నీ నామస్మరణతో తరింతుమయ్యా...

అంటూ హనుమాన్ జయంతిని జిల్లా ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. ఆంజనేయస్వామి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. పలు ప్రాంతాల్లో కొలువుదీరిన భారీ హనుమాన్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజించారు. శోభాయాత్రలు కొనసాగించారు. భక్తులతో ఆయా ప్రాంతాలు, ఆలయాలు కిక్కిరిశాయి. పలుచోట్ల ప్రముఖులు పాల్గొని పూజలు చేశారు. పవనసుతా.. పాహిమాం అనే నినాదాలు మార్మోగాయి.

- సాక్షి, ఒంగోలు


గొట్లగట్టులో తమలార్చనలో పాల్గొన్న భక్తులు


దొనకొండ మండలం బసిరెడ్డిపల్లి గ్రామంలో పూజలు చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే శివప్రసాద్‌రెడ్డి


మార్కాపురంలో పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి, మున్సిపల్ చైర్మన్ కృష్ణ


పేర్నమిట్టలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న సంతనూతలపాడు ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్‌బాబు


గిద్దలూరులో ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు


కొండపి మండలం కే ఉప్పలపాడులో అలంకరణలో స్వామివారు


మార్కాపురంలో శోభాయాత్రలో పాల్గొన్న కృష్ణమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కృష్ణ, భక్తులు


పామూరులో శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు


త్రిపురాంతకంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న భక్తులు

ఇరు కుటుంబాల మధ్య ఘర్షణ

- ముగ్గురిపై కత్తితో దాడి
- 14 మందిపై కేసు నమోదు
- సంఘటన స్థలాన్ని పరిశీలించిన మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి

కొమరోలు: ఒక పోలీసు కేసు విషయాన్ని మనసులో పెట్టుకుని గొడవలతో మొదలైన ఘర్షణ కత్తిపోట్లకు దారితీసింది. ఈ సంఘటన కొమరోలు మండలంలోని అక్కపల్లె గ్రామంలో ఆదివారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. అక్కపల్లె గ్రామానికి చెందిన భూమా లక్ష్మయ్య అన్న కుమార్తె పట్ల కొంకాల నడిపి ఓబులేసు అన్న కుమారుడు కొంకాల హర్షవర్ధన్ ఈ నెల 6వ తేదీ అసభ్యకరంగా ప్రవర్తించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు హర్షవర్ధన్‌పై పోక్సో కేసు నమోదు చేసిన పోలీసులు కోర్టులో హాజరుపరచగా నిందితుడిని రిమాండ్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో ఆదివారం హర్షవర్ధన్ తల్లి కొంకాల ఓబులమ్మ దేవాలయంకు వెళ్తున్న సమయంలో ఆ సంఘటనను మనసులో పెట్టు




గాయపడిన ఓబులమ్మ, పెద్ద ఓబులేసు, చిన్న ఓబులేసు

కున్న భూమా లక్ష్మయ్య చెల్లెలు జంగాల భూలక్ష్మి.. ఓబులమ్మను తిట్టి చెప్పుతో దాడి చేసింది. వారిద్దరూ ఘర్షణ పడుతుండగా గ్రామస్తులు సర్దిచెప్పి ఇళ్లకు పంపించారు. ఈ సంఘటనపై ఓబులమ్మ భర్త చిన్న ఓబులేసు కొమరోలు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయడానికి వెళ్తున్నట్లు తెలుసుకున్న భూమా లక్ష్మయ్య కుటుంబ సభ్యులు భూలక్ష్మి, గురువయ్య, లక్ష్మయ్య, లక్ష్మీదేవి, మరో ముగ్గురు కలిసి కొంకాల ఓబులమ్మ, పెద్ద ఓబులేసు, చిన్న ఓబులేసుపై దాడికి పాల్పడ్డారు. భూమా లక్ష్మయ్య తనతో తీసుకొచ్చిన కత్తితో ముగ్గురిపై దాడి చేయగా వారంతా గాయాలపాలయ్యారు. వారిని స్థానికులు ఓ ప్రైవేటు వాహనంలో గిద్దలూరు వైద్యశాలకు తరలించారు. సమాచారం అందుకున్న మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి, రాచర్ల ఎస్సై మహేష్ సంఘటన స్థలాన్ని పరిశీలించి గ్రామస్తులను విచారించారు. ఇరు కుటుంబాలలోని 14 మందిపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రాచర్ల ఎస్సై మహేష్ తెలిపారు. మార్కాపురం డీఎస్పీ వీరరాఘవరెడ్డి గిద్దలూరులోని వైద్యశాలకు వెళ్లి క్షతగాత్రులను పరిశీలించి జరిగిన సంఘటనపై విచారణ చేపట్టారు.


గ్రామంలో విచారిస్తున్న డీఎస్పీ వీరరాఘవరెడ్డి

ఫేక్ ప్రొఫైల్ మోసగాళ్లతో జాగ్రత్త : ఎస్పీ

ఒంగోలు టౌన్: సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైళ్లతో మోసాలు చేయడం ఎక్కువైందని, అలాంటి మోసగాళ్ల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ మలికాగర్గ్ ఆదివారం ఒక ప్రకటనలో సూచించారు. సాంకేతికతను అడ్డం పెట్టుకుని కొందరు మోసగాళ్లు కొత్త కొత్త మోసాలకు తెగబడుతున్నారన్నారు. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్ అకౌంట్లను ఫేక్ ప్రొఫైల్స్‌తో సృష్టించి మాయమాటలతో డబ్బు వసూలు చేస్తూ పలువురు మోసగాళ్లు నేరాలకు పాల్పడుతున్నారని తెలిపారు. ఫేస్‌బుక్‌లో ప్రైవసీ సెట్టింగ్‌లు లేని ఖాతాల వివరాలు సేకరిస్తున్నారని, తద్వారా కొత్త అకౌంట్లు తెరిచి అప్పటికే ఫ్రెండ్స్ లిస్టులో ఉన్నవాళ్లకు మళ్లీ రిక్వెస్టులు పంపిస్తున్నారని చెప్పారు. మెసెంజర్‌లో చాటింగ్ చేసి అత్యవసరంగా డబ్బు కావాలని, కొన్ని గంటల్లోనే తిరిగి ఇస్తామని అడుగుతున్నారని వివరించారు. నిజమని నమ్మి కొందరు డబ్బులిచ్చి మోసపోతున్నారన్నారు. ఎవరైనా సరే ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్, ట్విట్టర్ల చాటింగ్‌ల ద్వారా డబ్బు అడిగితే ఇవ్వవద్దని, సంబంధిత వ్యక్తులకు ఫోన్ చేసి నిర్ధారించుకోవాలని సూచించారు. ఏదైనా అనుమానం వస్తే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేసి నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్‌కు ఫిర్యాదు చేయాలని తెలిపారు. సామాజిక మాధ్యమాల వినియోగదారులంతా వారి ప్రొఫైల్ లాక్ చేసుకోవాలని ఎస్పీ సూచించారు.

రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పొత్తులు

- జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్

ఒంగోలు అర్బన్: జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పనిచేస్తున్నారని అందులో భాగంగానే పొత్తులు ఉంటాయని ఆ పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ అన్నారు. ఆదివారం జిల్లాకు వచ్చిన ఆయన స్థానిక ప్రైవేటు హోటల్‌లో రోడ్డు ప్రమాదంలో మరణించిన పార్టీ కార్యకర్త కుటుంబానికి రూ.5 లక్షల ఆర్థిక సహాయం పార్టీ తరఫున అందజేశారు. ఈ సందర్భంగా విలేకర్లతో మాట్లాడుతూ ఏ పార్టీతో పొత్తు పెట్టుకున్నా రాష్ట్ర ప్రయోజనాలు, రాష్ట్ర ప్రజల సంక్షేమమే ముఖ్యమన్నారు. దీనిలో జనసేన పార్టీ నాయకులు షేక్ రియాజ్, ఈదర హరిబాబు, పెదపూడి విజయ్‌కుమార్, గౌతమ్, అరుణ, మలగా రమేష్, సాయిబాబు ఇతర నాయకులు పాల్గొన్నారు.

ఆసియా స్థాయి పోటీల్లో బంగారు పతకం

ఒంగోలు: దక్షిణ కొరియాలో జరుగుతున్న ఆసియా ఫసిఫిక్ మాస్టర్ గేమ్స్‌లో ఒంగోలుకు చెందిన కొల్లు రాజేశ్వరి 40 సంవత్సరాల విభాగం డిస్కస్‌త్రో పోటీల్లో ఆదివారం బంగారు పతకం సాధించారు. ఆమె ప్రస్తుతం ఒంగోలులో పశుగణాభివృద్ధి సంస్థలో జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. దక్షిణ కొరియా వెళ్లేందుకు ఎంతోమంది ప్రోత్సాహం అందించారని, అందరి అంచనాలకు అనుగుణంగా సత్తాచాటి బంగారు పతకం సాధించడం అభినందనీయమని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వినుకొండ రాజారావు పేర్కొన్నారు. ఆమెతో పాటు మరికొంతమంది కూడా దక్షిణ కొరియా వెళ్లారని, వారు కూడా పతకాలు సాధించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.


పతకం అందుకుంటున్న రాజేశ్వరి

రెండు వాహనాలు ఢీ

- సుమారు 480 బాయిలర్ కోళ్లు మృతి

కనిగిరి రూరల్: టాటా మ్యాజిక్ ఆటో, అశోక్ లేల్యాండ్ వాహనం ఢీకొన్న ప్రమాదంలో సుమారు లక్షా యాభై వేల రూపాయల విలువైన కోళ్లు మృతిచెందాయి. ఈ సంఘటన ఆదివారం కనిగిరి పట్టణంలోని కొత్తూరు వద్ద చోటుచేసుకుంది. కనిగిరి మండలం బల్లిపల్లి నుంచి ఫారం కోళ్ల లోడుతో మార్కాపురం వైపు వెళ్తున్న టాటా మ్యాజిక్ ఆటో, కనిగిరి నుంచి కడప వైపునకు శనగల లోడుతో వెళ్తున్న అశోక్ లేల్యాండ్ వాహనం ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో సుమారు రూ.1.50 లక్షల విలువ చేసే ఫారం కోళ్లు మృతి చెందాయి. టాటా మ్యాజిక్ వాహనం నుజ్జునుజ్జయింది. డ్రైవర్, క్లీనర్లకు గాయాలవడంతో కనిగిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్, పోలీసులు సందర్శించి రోడ్డుపై ఉన్న వాహనాలు, కోళ్ల కళేబరాలను తొలగించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.


కోళ్ల వాహనాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్, పోలీసులు

గుంటూరు వద్ద రోడ్డు ప్రమాదం

- ఒంగోలు అసిస్టెంట్ లేబర్ కమిషనర్, కుటుంబ సభ్యులకు గాయాలు

గుంటూరు రూరల్: ఆటోను కారు ఢీకొన్న ప్రమాదంలో నలుగురు వ్యక్తులు గాయపడ్డారు. ఈ సంఘటన గుంటూరు వద్ద నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. నల్లపాడు పోలీస్ స్టేషన్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. ఒంగోలు అసిస్టెంట్ లేబర్ కమిషనర్‌గా పని చేస్తున్న దుర్గాభవాని తన కుమార్తె కళ్యాణిని నగర శివారులోని కళాశాలలో చేర్పించేందుకు ఆటోలో వచ్చారు. కళాశాలలో మాట్లాడుకుని తిరిగి ఆటోలో వెళ్తుండగా, ఆర్టీవో కార్యాలయ సమీపంలో అతివేగంగా వచ్చిన కారు ఆటోను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో దుర్గాభవాని, ఆమె కుమారుడు, కుమార్తె, ఆటోడ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు వారిని తరలించారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స నిమిత్తం ఓ ప్రైవేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. సంఘటనపై నల్లపాడు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గాయాలపాలైన ఒంగోలు అసిస్టెంట్ లేబర్ కమిషనర్ దుర్గాభవాని, ఆమె కుమార్తె కళ్యాణి



ప్రమాదంలో దెబ్బతిన్న కారు, ఆటో